శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

- కార్యాలయ పరిసరాలు శుభ్రం చేస్తున్న డీ ఆర్ ఓ విజయ్ కుమార్

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధి విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు. కలెక్టర్ కార్యాలయ సిబ్బంది. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేసి క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. తొలుత కార్యాలయ ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

జనగణనలో ప్రజలందరూ పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

- స్వీయ గణనలో తన వివరాలు నమోదు చేసిన కలెక్టర్

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త జిల్లాలో జనగణన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్వీయ జనగణన ప్రక్రియలో భాగంగా తన కుటుంబానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఎస్ఈ.సెన్‌సెస్.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసిన కలెక్టర్, ప్రజలు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 30వ తేదీ వరకు ప్రతి కుటుంబం తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. దేశ జనాభా లెక్కలు సక్రమంగా నమోదు కావడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనకు దోహదపడుతాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన

ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి అయిన కె. సురేష్ రెడ్డి శనివారం జిల్లాకు విచ్చేశారు. జిల్లాలో అన్ని కోర్టుల న్యాయ అధికారులకు డిస్ట్రిక్ట్ కోర్టులో వర్క్‌షాప్, కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. డా.అజిత వేజెండ్ల, జస్టిస్ కే. సురేష్ రెడ్డిని జిల్లా కోర్టు సముదాయం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా స్థాయిలో న్యాయ, పోలీసు శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడానికి పోలీస్ శాఖ తరఫున తీసుకోవలసిన చర్యలపై సంక్షిప్తంగా చర్చించి, న్యాయమూర్తి నుంచి విలువైన సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఇతర న్యాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనధికార లేవుట్ల చట్టబద్ధహక్కులకు ఎల్ఆర్ఎస్ పథకం

- కమిషనర్ - కార్పొరేషన్‌లో 21, 22, 23తేదీల్లో ఓపెన్‌ఫోరం

నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేవుట్లలో ప్లాట్ల యజమానులకు చట్టబద్ధ హక్కులు కల్పించే ఎల్ఆర్ఎస్ పథకం అవకాశాన్ని ఈనెల 21,22,23వ తేదీల్లో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్న ఓపెన్‌ఫోరం కార్యక్రమం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అనధికార లేవుట్లలోని ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రమబద్ధీకరణ పథకం ఎల్ఆర్ఎస్ 2025తేది 23ఏప్రిల్ 2026తో ముగియనున్నదని ఇప్పటి వరకు క్రమబద్ధీకరించుకోని ప్లాట్ల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరించుకొని లేవుట్లు ప్లాట్లలో నెల్లూరు నగరపాలకసంస్థ నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు, మౌళిక వసతులను కల్పించబోమని యజమానులు గుర్తించుకొని తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

నెల్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త-విద్య : నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజవకర్గం పరిధిలోని వెంకటాచలం అలెక్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల క్రీడామైదానంలో శనివారం 55వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా,పురుషుల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి బోల్లవరం రామాంజనేయులు, జిల్లా అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి విక్టర్, వ్యాపారవేత్తలు అగస్టీన్, కుమార్‌రెడ్డిలు పాల్గొని పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విక్టర్ మాట్లాడుతు క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలని కోరారు. ఇందులో విజేతలైన వారు రాష్ట్ర జట్టుకు ఎంపిక కావటం జరుగుతుందన్నారు. ఈనెల 28నుండి తెలంగాణా రాష్ట్రం హనుమకోండలో సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. కాగా పురుషుల విభాగంలో రాష్ట్రంలోని 16 జిల్లాల నుండి జట్లు రాగా, మహిళా విభాగంలో 13 జిల్లాల నుండి జట్లుఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లాల అసోషియేషన్ నిర్వాహకులు రాజారావు , లక్ష్మణరావు, కోటేశ్వరరావు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కంపెనీల లారీల రాకపోకలతో అస్తవ్యస్తమైన రహదారులు

- నిరసన తెలిపిన గ్రామస్తులు



చిల్లకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త నిత్యం మండలంలోని ఏరూరు మార్గంలో రాకపోకలు సాగించే మెగా, జిందాల్, మీనాక్షి, క్రిసిటీ కంపెనీలకు చెందిన లారీల కారణంగా రహదారులు పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్తులు శనివారం ధర్నా చేపట్టారు. గ్రామస్థులు లారీలను నిలిపేయడంతో సుమారు కిలోమీటర్ దూరం వరకు లారీలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ గోపీనాథ్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఆయా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పలు కంపెనీలకు చెందిన భారీ లారీలు ప్రతి రోజూ గ్రావెల్, సిలికా, ఇతర మెటీరియల్‌తో రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు దెబ్బతిందని తెలిపారు. లారీలు వెళ్ళే టప్పుడు గుంతల్లో ఉన్న రాళ్ళు ఎగిరి ప్రజలపై పడుతున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నా రు. ఏరూరు గ్రామంలోకి వెళ్ళే కిలోమీటర్ దూరం వరకు రోడ్డును వెంటనే నిర్మిస్తే కానీ, లారీలను తిరగనివ్వమని వారు తెగేసి చెప్పారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇంటర్‌లో ఉత్తమమార్కుల సాధించిన ప్రణవిని

అభినందించిన వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి



బుచ్చి ఏప్రిల్ 18 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన కృష్ణ చైతన్య కాలేజి విద్యార్థిని వై.ప్రణవి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో456 మార్కులు సాధించిన సందర్భంగా వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మి, దొడ్ల కోదండరామిరెడ్డి ఆవిద్యార్థిని అభినందించారు. బాగా చదువుకోవాలని అందుకు మావంతు సహకారం కూడా ఇస్తామని వారు హామి ఇచ్చారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

జనగణన 2027 పారదర్శకంగా ఖచ్చితంగా జరగాలి

మనుబోలు ఏప్రిల్ 18 ప్రభాతవార్త : మనుబోలు మండలంలోని జనగణన నిర్వహించే అధికారులకు మూడు రోజులుపాటు శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తి అయ్యాయని మండల తహసిల్దారు రమాదేవి అన్నారు. ఆమె మాట్లాడుతు జనగణన చేసే అధికారులు నిర్దేశిత కాల వ్యవధిలో కుటుంబాలవారీగా మొబైల్ యాప్ ద్వారా ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమయంలో పారదర్శకత సమయపాలన ఖచ్చితత్వంకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛంధంగా తమ కుటుంబ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం వల్ల గణన ప్రక్రియ వేగవంతంగా మరియు ఖచ్చితత్వంగా పూర్తివుతుందని తెలిపారు. ఈ గణాంకాలు దేశ అభివృద్ధికి ప్రణాళికలకు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి అని అన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించండి

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కావలి ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : గిరిజన కాలనీలో మౌళిక సదుపా యాలతో పాటు ప్రతిరోజూ నీరు అందించాలని, ఉపేక్షి స్తే ఊరుకునేది లేదని కావాలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధికారుల ను హెచ్చరించారు. కావలి పట్టణంలోని 36వ వార్డు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన సంఘం కాలనీలో ఎమ్మెల్యే శనివారం విస్తృతంగా పర్యటించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. తాగునీరు ప్రతిరోజూ అందించకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో ప్రధానంగా ఎస్టీ, యానాది, గిరిజన వర్గాలకు చెందిన కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని కష్టపడి జీవనం సాగించే ఈ వార్గలు ఇటీవల తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఇప్పటికే పైపులైన్ పనులు పూర్తి చేసి నీటిసరఫరా ప్రారంభించినప్పటికి మున్సిపాలిటికి చెందిన మోటార్ దొంగతనం కావడంతో సరపరాలో అంతరాయం ఏర్పడినట్లు అధికారులు వెల్లడించారు. దీనిపై స్పందించి మోటార్ మరమ్మత్తు పూర్తయ్యేంత వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని ఆదేశించారు. ఇకపై ఇలాటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేట్టాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. రహదారుల సమస్యను గుర్తించి సిసిరోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రాత్రివేలల్లో వీధిదీపాల లేమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వెనుకబడిన, గిరిజన వర్గాలు సమస్యలను బయటపెట్టలేక బాధపడుతున్నారని అలాంటి వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డిఈ సాయిరామ్, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, మున్సిపల్ అధికారులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు

ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ క్లస్టర్ ఇన్చార్జిల నియామకం

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చింతారెడ్డిపాళెంలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు నెల్లూరు రూరల్ నియోజకవర్గం 26 డివిజన్‌లు, నెల్లూరు రూరల్ మండలం సంబంధిత క్లస్టర్ ఇన్చార్జిలను ఆనం విజయకుమార్ రెడ్డి నియమించడం జరిగింది.ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తకి గుర్తింపు ఉంటదని తెలియజేశారు. క్లస్టర్ ఇన్చార్జిలను డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ఇంచార్జిలు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ మరియు నెల్లూరు రూరల్ మండలం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకం కాదు

- నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి

- 106వ రాజ్యాంగ సవరణను వెంటనే అమలు చేయాలి

నెల్లూరు అగ్రికల్చర్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త రాజకీయ లబ్ధి కోసం బీజేపీ పార్టీ ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోడంతో నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం నిర్వహించి, నివాళులర్పించిన నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి. ఈ సందర్భంగా నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పార్టీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయకుండా, ఉభయ సభల్లో మెజార్టీతో సంబంధం లేకుండా 2/3వ వంతు మద్దతు ఉంటేనే రాజ్యాంగ సవరణ సాధ్యపడేటట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లాంటి మహానుభావులు ఆనాడే ఆలోచన చేశారు. బీజేపీ పార్టీ నియంతృత్వ ధోరణికి ఇది ఒక చెంపపెట్టు లాంటిది. బీజేపీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమని దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదం, 2023న 106వ రాజ్యాంగ సవరణ చేసి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌కు గెజిట్ విడుదల చేసినా, జనగణను సాకుగా చూపుతూ బీజేపీ ప్రభుత్వం అమలు చేయలేదు. నేటికి జన గణన పూర్తి కాకపోయినా, తిరిగి మహిళా రిజర్వేషన్ బిల్లుకు డిలిమిటేషన్ బిల్లును జతకట్టి పార్లమెంట్లో ప్రవేశపెట్టి రాజ్యాంగాన్ని అపహాస్యం చేయాలని ప్రధాని మోడీ చూశారు. మహిళలను చట్టసభల్లో తీసుకుని రావాలని బీజేపీ పార్టీకి ఏనాడూ ఆలోచన చేయలేదు. స్థానిక సంస్థల్లో, మున్సిపాలిటీలలో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ మహిళలను ప్రధాన మంత్రులుగా, దేశాధినేతలుగా చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం కొత్త పొలిటికల్ డ్రామాకు తెరలేపింది.

రాష్ట్రంలో బీజేపీ పార్టీ అంటే బాబు, జగన్, పవన్ పార్టీ

జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ కేంద్రంలో మాత్రం మోడీకి మద్దతు పలుకుతూ రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెడుతున్నారు. రాష్ట్రానికి కావాల్సిన ప్రత్యేక హోదా కోసం, పోలవరం ప్రాజెక్టు కోసం నిధులు,రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల కోసం పార్లమెంట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఏనాడు మాట్లాడిన సందర్భం లేదు.నేడు జగన్‌మోహన్‌రెడ్డి దురుద్దేశంతో కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకమని దుష్ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నాం. లోక్ సభలో బీజేపీ ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు వీగిపోవడం రాజ్యాంగ గెలుపుగా కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. బీజేపీ మతత్వంతో దేశాన్నివిచ్ఛిన్నం చేయాలని చూస్తుంది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. జనగణనతో సంబంధం లేకుండా 2023న 106వ రాజ్యాంగ సవరణ ద్వారా వంద శాతం ఆమోదం పొందిన చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. కార్యక్రమంలో పాల్గొన్న వారు సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ యశోదర, ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నగర అధ్యక్షుడు ఇర్ఫాన్, ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్, లీగల్ సెల్ కన్వీనర్ వి.సుధీర్, హనీఫ్, కిషోర్, అల్లావుద్దిన్, డాక్టర్ ప్రసాద్, రాజా, నాగరాజు, సేవాదళ్ సుజాత, రాజేష్, అభిద్ తదితరులు పాల్గొన్నారు.

5లక్షల ప్రమాద భీమా అందజేసిన ఎమ్మెల్యే

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కావలి రూరల్ మండలం తాళ్ళపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యురాలు గంటా గీతాంజలి విద్యుత్‌షాక్‌కు గురై ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందారు. ఆమె టిడిపి సభ్యత్వం కలిగి ఉండడంతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంత్రి నారాలోకేష్‌బాబు పంపిన రూ.5లక్షల సాయంను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శనివారం గీజాంజలి భర్త క్రిష్ణమూర్తికి ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా క్రిష్ణమూర్తి మంత్రి నారాలోకేష్‌బాబుకి, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపాలెం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొలపనాయుడుపల్లిలో పోషణ పక్వాడ

చేజర్ల ఏప్రిల్ 18 ప్రభాతవార్త : చేజర్ల మండలం కొలపనాయుడుపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గర్భ వతులు బాలింతలు పిల్లలు తల్లిదండ్రులకు పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పిం చారు. తీసు కునే ఆహారంలో విటమిన్లు ప్రోటిన్లు పిండి పదార్థాలు

అన్ని రకాల పోషక విలువలు ఉండే పాలు గుడ్లు ఆకుకూరలు లాంటివి ఆహారంలో ప్రతి రోజు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యను అందించాలని తెలిపారు. సూపర్‌వైజర్ ఎం.పద్మ, ఎంఎల్‌హెచ్ పి.మాధురి, అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

బడివీడు పిల్లలందరు - ప్రభుత్వ పాఠశాలలోనే ఉండాలి

కలువాయి ఏప్రిల్ 18 ప్రభాతవార్త : బడివీడు పిల్లలందరు ప్రభుత్వ పాఠశాలలోనే ఉండాలని ఎంఇఒ -2 ఎస్ జనార్దన్‌రెడ్డి ప్రధానో పాధ్యాయులు ఎస్‌డి అబ్బాస్ అలీ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడిపిలుస్తోంది కార్యక్రమాన్ని బివిఎన్‌ఆర్ జడ్‌పిహైస్కూల్‌లో ఎంఇఒ 2 జనార్దన్‌రెడ్డి పాఠశాల ప్రదానో పాధ్యాయులు

ఆధ్వర్యంలో శనివారం బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యా ర్థులతో పెద్దఎత్తున ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నందు విద్యార్థులతో మానవ హారం నిర్వహించి వారు మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో ఉండే అనేక సౌకర్యాలను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు తెలియజేసి ప్రతి ఒక్క విద్యార్థి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే వుండే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. అదే విధంగా ప్రభుత్వం అందించే అనేక సౌకర్యాలు గురించి ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.పెంచలపుల్లయ్య, బి. శ్రీనివాసులు, ఎస్‌ఓ బులేసు, వి.కృష్ణయ్య, రాజా, ఉపాధ్యాయనిలు, సిఆర్‌ఎంటిలు కె మహేశ్వర్, టి. నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంగంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

సంగం ఏప్రిల్ 18 ప్రభాతవార్త : సంగం తహసిల్దారు కార్యాలయం వద్ద మూడో శనివారం సందర్భంగా తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు నీటి వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంచార్జి తహసిల్దారు అంబటి వెంకటేశ్వరు కార్యాలయ ఆవరణలో చీపుర పట్టి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవిలో నీటిని ఆదా చేయాలని నినాదాలు చేస్తు మానవ హారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ

సీతారామపురం ఏప్రిల్ 18 ప్రభాతవార్త : మనతోపాటు మన చుట్టు వున్న ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంటే స్వచ్ఛ మైన వాతవరణంతోపాటు ఆరోగ్య కరమైన శరీరాన్ని కలిగి ఉండి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని ఎంపిడిఒ శివప్రసాద్‌రావు తెలిపారు. శనివారం సీతారామ

పురం మండల కేంద్రంలోని బిట్ 1 సచివాలయం వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమాలను ప్రారం బించారు. ఎండలు తీవ్రతరం అవుతున్న దృష్ట్యా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కీలక పాత్ర పోషించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ గైరు హాజరు కావడం పట్ల పలువురు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. కేవలం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ కార్యక్రమం మండల కార్యాలయం వరకే పరిమితం కావడంపు అధికారుల తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఏ స్వప్న, మాజీ సర్పంచ్ కొడవటి కంటి బాగ్యమ్మ, మండల యూత్ అధ్యక్షులు పసుపులేటి వికాస్ బాబు, పిడుగు రమేష్, మాజీ సర్పంచ్ ఆదెయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సమావేశంలో కలువాయి క్లస్టర్ ఇంచార్జిలు

కలువాయి ఏప్రిల్ 18 ప్రభాతవార్త : రాష్ట్ర స్థాయి క్లస్టర్ శిక్షణ కార్యక్రమాలను టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయం నందు రెండు రోజులుపాటు నిర్వహించగా మండల నుండి ఒకటో వ క్లస్టర్ ఇంచార్జి గాడిపర్తి జగదల్‌నాయుడు కో క్లస్టర్ ఇంచార్జి తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి , 2 వక్లస్టర్ ఇంచార్జి గద్దం కిషోర్‌రెడ్డి కో క్లస్టర్ ఇంచార్జి చిల్లుకూరి ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగతపై పార్టీని అన్ని విధాలా ముం దుకు తీసుకొని వెళ్ళే విధంగా క్లస్టర్‌లు ప్రధాన

శీర్షిక పోషించాలని సమావేశంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినట్లు క్లస్టర్ ఇంచార్జిలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్దంగా ఉండాలని పార్టీ క్షేత్ర స్థాయికి పిలుపు నివ్వడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్లస్టర్ ఇంచార్జిలు ముఖాముఖి నిర్వహించారని క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

వేసవి పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన

కలువాయి ఏప్రిల్ 18 ప్రభాతవార్త: వేసవిలో గర్భవతులు చిన్నపిల్లలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి పోషణ పక్వాడలో వారికి ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరమ్మ అంగన్‌వాడీ కార్య కర్తలు వివరించారు. పోషణ పక్వాడాలో భాగం గాశనివారం కుల్లూరు సెక్టార్‌లోని వెంకటరెడ్డి పల్లి, మెయిన్ ,హరిజనవాడ అంగన్‌వాడీ స్కూల్, చింతలపాళెం నందు కార్యక్రమానలు నిర్వహిం చారు. పోషణ గురించి అవగాహన నిర్వహించ దంతోపాటు పిల్లల ఇంటింటికి వెళ్లి వేసవి పట్ల జాగ్రత్తలను

ప్రత్యేకంగా తీసుకోవాల్సిన శ్రద్ధ గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

తమ్మిన్నపట్నంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చిల్లకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండలంలోని తమ్మిన్నపట్నం పవర్ మ్యాచ్ ప్రోజెక్ట్ లిమిటెడ్ నందు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేసే సిబ్బందికి పవర్ ప్లాంట్‌లో బాయిలర్ బ్లాస్ట్ అవ్వడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతాయని అటువంటి

ప్రమాదం జరిగినప్పుడు సిబ్బంది అప్రమత్తంగా వుండి తనకు తాను రక్షించుకుంటూ మిగత వారిని రక్షించాలని ముందు ప్రమాదం జరిగిన వెంటనే సిబ్బందిని హాజరుపరిచి వారి వద్ద నుంచి అటెండెన్స్ తీసుకొని ఎంత మంది ఉద్యోగులు మిస్ అయ్యారో గుర్తించి రెస్క్యూ టీం, ఫైర్ ఫైటింగ్ టీం, ఎవక్యూషన్ టీం, ఫస్ట్ ఎయిడ్ టీం, ట్రాన్స్‌పోర్ట్ టీం, మేనేజ్మెంట్ టీం, మీడియా టీం, సెర్చ్ అండ్ రెస్క్యూ టీంలన్ని ప్రమాద స్థలానికి వెళ్లి సెర్చ్ అండ్ రెస్క్యూ టీం గాయపడిన వారిని, క్షతగాత్రులను తీసుకువచ్చిన వెంటనే వారికి ఫస్ట్ ఎయిడ్ టీంకి అప్పగించి వారి చేత ట్రీట్మెంట్ ఇచ్చి అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కి తరలించాలని సూచించారు. ప్రమాదం ఎక్కువ అయినట్లయితే గుర్తించి ఫైర్ టెండర్ మరియు డాక్టర్స్ అంబులెన్స్‌ను పిలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీనాక్షి ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ బాషా, మనోహర్, అగ్నిమాపక సిబ్బంది, ఏఎస్ఎఫ్‌ఓ డి. విజయ్ కుమార్, ఎల్ఎఫ్ కె. నారాయణ, ఎల్ఎఫ్ పి. ప్రదీప్, డిపిఓ ఈ. శ్రీహరి, ఎఫ్.ఎం. జి. మహేంద్ర, ఎం. నాగరాజు, కె. రవీంద్ర రెడ్డి లు పాల్గొన్నారు.

22న ఉచిత కంప్యూటర్ శిక్షణ

గూడూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : చదువు మానేసిన, ఇక చదువలేం అనే పేద విద్యార్థులకు పది నుండి ఆపై 30 ఏళ్ళు లోపు ఉన్న వారికి పి.ఎస్.ఎస్.ఎం, స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ రీసెర్చ్ ఫౌండేషన్ వారి ఉమ్మడి అద్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుండి



ఉచిత కంప్యూటర్ శిక్షణ నెల రోజుల పాటు ఇవ్వడం జరుగుతుందని సమ్మా ఆజీవ ప్రాజెక్ట్ నిర్వాహకులు దేవరాజు తదితరులు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్ పేటలో ఉన్న కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ వారికి నైపుణ్యంతో కూడిన శిక్షణ ప్రత్యేకంగా ఆన్ లైన్‌లో నేర్పించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలమ్మ, నాగమణి, దుర్గా, ఇందిరమ్మ, మునిరాజ, రాధమ్మ, రాజేశ్వరి, జయమ్మ, పుష్ప, వేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోనలో పెంచల స్వామి అన్నదానానికి రూ. 1,01,116 విరాళం

రాపూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి శనివారం శ్రీవారి భక్తులు రూ. 1,01,116 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఇంచార్జ్ ఉప కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా, తిరుపతి వాస్తవ్యులు చెరుకు తోట శ్రీధర్ పేరుతో తండ్రి చెరుకు తోట సతీష్



చంద్ర బోస్, హరిత లు పెంచల స్వామి నిత్యాన్నదాన పథకమునకు రూ.1,01,116/నగదు రూపంలో అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో శ్రీవార్ల ధర్శనం శేష వస్త్రములు మరియు ప్రసాదము అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమాజంలో అందరికి పౌష్టికాహారం పట్ల అవగాహన అవసరం

- ప్రాజెక్ట్ అధికారిణి సునీలత

అనుమసముద్రంపేట, ఏప్రిల్18, ప్రభాతవార్త: ఏఎస్‌పేట మండలంలోని అనుమసముద్రం-5 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్‌పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అందరికి

పౌష్టికాహారం పట్ల అవగాహన పెంపొందించాలని, చైతన్యం కావాలన్న సంకల్పంతో పౌష్టికాహార పక్షోత్స వాలను నిర్వహిస్తున్నామన్నారు. గర్భినీలు, బాలింతలు, చిన్నారులు తగినంతగా పోషకవిలువలు కలిగిన ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసమే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటుందని , అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని దాంతోపాటు పౌష్టికాహారం గురించి అందరికీ అవగాహన పెంపొందించాలని 8వ పోషణపక్వాడా పక్షోత్స వాలను ఈనెల 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ గ్రామాన , వాడ వాడలా అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్స వాలను నిర్వహిస్తున్నా మన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకవిలువల ఆహారాలతోపాటు తమకు అందుబాటులో ఉండే పౌష్టికాహారానిన కూడా తీసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లికిమాత్రమే కాక తండ్రులకు కూడా అవగాహన ఉండఆలని, బిడ్డల తండ్రులతో సూపర్ డాడ్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లల తండ్రులతో పిల్లలకి తినే పౌష్టికాహారాన్ని తయారు చేయించి తినిపించమని చెప్పారు .చిన్నారులు జంక్‌ఫుడ్ తినకుండా చూడాలని, గర్భిణీలు , బాలింతలు తగినంత పౌష్టికాహారం తీసు కునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి.కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.ప్రసన్న, డి. పుష్పకళ, ఎస్.కె.జరింతాజ్‌బేగం, అంగన్‌వాడీ హెల్పర్లు , తల్లులు, చిన్నారుల తల్లి దండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ నిర్ణయించిన రేట్లకే చేపల అమ్మకం జరపాలి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఇందుకూరుపేట జిల్లా మంచినీటి చేపల రైతుల సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు బాబు నాయుడు సెక్రటరీ రవి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాబు నాయుడు మాట్లాడుతూ జిల్లా కమిటీ నిర్ణయించిన రేట్లకే చేపల రైతులు అమ్మకాలు జరపాలని కోరారు. రూప్ చందు 1 కేజీ రూ.110, గండి బొచ్చ కేజీ రూ.117, ఫంగయిన్ కేజీ రూ.108లు

నిర్ణయించారు. జిల్లాలోని చేపల రైతు సోదరులు జిల్లా కమిటీ నిర్ణయించిన రేట్లకు తగ్గకుండా అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలుదారులు జిల్లా కమిటీ నిర్ణయించిన రేట్లకే చేపలు కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్‌రెడ్డి, ట్రెజరర్ మోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు, వినోద్ కుమార్, శ్రీధర్ నాయుడు, కే.ప్రభాకర్‌రెడ్డి, పశుపతి నాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా బీఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్

ఇందుకూరుపేట, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని బాలాజీ విద్యా మందిర్ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి. ఈ పోటీల్లో మండలంలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 12 జట్లు తలపడగా, తుదిపోరులో కుడితి పాలెంలోని

బీఆర్ఆర్ ఇంగ్లీష్ మీడియా హైస్కూల్ జట్టు తమ క్రీడా ప్రతిభను చాటి రన్నరప్ ట్రోఫీని కైసవం చేసుకుంది.

హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్: నరసాపురం జడ్పీ హైస్కూల్, బీఆర్ఆర్ ఇంగ్లీషన మీడియం పాఠశాల జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. ఆట ఆద్యంతం ఇరు జట్లు పాయింట్ల కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోరులో కేవలం రెండు పాయింట్ల స్వల్ప తేడాతో బీఆర్ఆర్ స్కూల్ జట్టు రన్నరప్‌గానిలిచింది. విజేతలకు మండల విద్యాశాఖాధికారి సునీల్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయని, ఓటమిని కూడా గెలుపుగా సోపానంగా తీసుకోవాలని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. బీఆర్ఆర్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల కరస్పాండెంట్ మహేంద్ర కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పిల్లల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి, వారిని ప్రోత్సహించడంలో ప్రధానోపాధ్యాయులు హరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు యేసురాజు తీసుకుంటున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం, సిబ్బంది ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తమన్నా రాకతో ఎస్‌వీఎస్‌లో కోలాహలం : పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం.. ప్రేరణాత్మక సందేశం : మెడల్స్, ప్రశంసాపత్రాల ప్రదానం..

కొడవలూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: మండలం నార్త్ రాజుపాలెం గ్రామంలో ఉన్న ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సినీతార తమన్నా రాకతో కళాశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. విద్యార్థులు భారీగా హాజరై ఉత్సాహంతో సందడి చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌వీఎస్ సంస్థ చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ వైభవంగా నిర్వహించారు. కళాశాలకు విచ్చేసిన తమన్నాకు పుష్పగుచ్ఛం

అందజేసి ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఆమె రాకతో విద్యార్థినీ, విద్యార్థులు ఆనం దోత్సా హాలతో ఊగిపోయారు. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ, గుణశేఖర్ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హాజరుకావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు తమ ప్రతిభను అన్ని రంగాల్లో

అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కష్టపడి చదవడం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే తప్పక విజయం సాధించవచ్చని తెలిపారు. విఫలాలను భయపడకుండా వాటినుంచి పాఠాలు నేర్చుకోవాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. తదుపరి ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ, తమన్నా, పాయల్ రాజ్ పుత్, మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా, వంటి ప్రముఖ సినీతార కళాశాలకు రావడం విద్యార్థులకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన కొంతమంది విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈవెంట్ మొత్తం అత్యంత వైభవంగా జరిగింది. భద్రతా పరంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏవో గిరీష్ కుమార్, బోధనా సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోనలో నృసింహుని అన్నదానానికి రూ.1,00,116 విరాళం

రాపూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచల కోనలోని శ్రీ పెనుశీల లక్ష్మీ నరసిం హస్వామి వారి నిత్య అన్నదానానికి శనివారం శ్రీవారి భక్తులు రూ.1,00,116 విరాళాన్ని అంద జేసినట్లు ఆలయ ఇంచార్జ్ ఉప కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా, చిట్వేలి మండలం, వాస్తవ్యులు కీ.శే.జరుగు .రాజా రెడ్డి జ్ఞాపకార్థం

ధర్మపత్ని నాగవల్లి కుమార్తెలు సునీత, సుజాత, సరిత, సంగీత, అల్లుదు మోహన్ కృష్ణారెడ్డి, శేషా రెడ్డి, రాజేష్ కుమార్ రెడ్డి నిత్యాన్నదాన పథకమునకు రూ.1,00,116/నగదు రూపంలో అందజేశారు. వారికి ఆలయ మర్యాదలతో శ్రీవార్ల ధర్శనం శేష వస్త్రములు మరియు ప్రసాదము అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్, సెల్‌ఫోన్ వినియోగంపై సీడీపీవో శారద హెచ్చరిక

కొడవలూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త: మండల కేంద్రం పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కోవూరు సీడీపీవో టి. శారద మాట్లాడుతూ, అంగన్‌వాడీ స్థాయిలోనే పిల్లల్లో విద్యాపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకమని తెలిపారు. ప్రీస్కూల్ విద్య పూర్తిచేసుకున్న చిన్నారులను తదుపరి విద్యకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

అలాగే, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయని, పోషకాహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. చిన్న వయస్సులోనే సెల్‌ఫోన్‌ల వినియోగం పెరగడం వల్ల దృష్టి లోపాలు, మానసిక సమస్యలు, చదువుపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ టి. అశోక్ కుమారి, సూపర్వైజర్ కె. కోటేశ్వరమ్మ, ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం రామకృష్ణ, పీహెచ్ఎన్ శిరీష, ఏఎన్ఎంలు పి. దీనమ్మ, కొడవలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్కే జిలాని భాష, సొసైటీ డైరెక్టర్ పంది శ్రీనివాసులు, నిటి సంఘ డైరెక్టర్ ఏ. అజయ్ బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో తల్లులు పాల్గొన్నారు.

చెరువులో చేపలు పట్టుకునేందుకు వేలం పాట

చిల్లకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : మండల పరిధిలోని భోదనం గ్రామ పంచాయతీలోని భోదనం చెరువులో చేపలు పట్టుకునేందుకు అధికారులు శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 4లక్షల 11 వేల రూపాయిలు అదే గ్రామానికి చెందిన పసల చిరంజీవి పాడుకున్నారు. నేటి నుండి 2027 జూన్ వరకు చెరువులో చేపలు పట్టుకోవచ్చనని ప్రత్యేకాధికారి వెంకట్రావు తెలిపారు.

అయితే చెరువులో ఉన్న నీటిని కిందకి వదలకుండా చేపలు పట్టుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత సమాజమే లక్ష్యం

- గూడూరు సమీక్షలో అధికారుల పిలుపు - గోడపత్రికల ఆవిష్కరణ

గూడూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : బాల్య వివాహమనేది సామాజిక నేరమని, అక్షయ తృతీయ వంటి పర్వదినాల ముసుగులో పసిపిల్లల జీవితాలతో ఆడుకోవడం క్షమించరాని నేరమని అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హెచ్చరించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం, ఐసీడీఎస్,

ఐసీపీఎస్, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంయుక్తాధ్వర్యంలో శనివారం నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు విజిలెన్స్ డే (అప్రమత్తత దినోత్సవం) పాటించారు. అనంతరం ఈ అంశంపై రూపొందించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

- 2030 నాటికి సంపూర్ణ మార్పు:

చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఐ. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే జిల్లాలో బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గిందని హర్షం వ్యక్తం చేశారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 2030 నాటికి నెల్లూరు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం పంచాయతీలు, పాఠశాలలు, మత పెద్దలను భాగస్వాములను చేస్తున్నట్లు వివరించారు.

- చట్టం అతిక్రమిస్తే కఠిన చర్యలు

బాల్య వివాహాల నిషేధ చట్టం2006 (పిసిఎంఎ) ప్రకారం వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. నేరం రుజువైతే రెండేళ్ల జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధిస్తారని హెచ్చరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబ్ బి, ఐసీపీఎస్ అధికారిణి ఎస్. సుమలత మాట్లాడుతూ వివాహాల సీజన్‌లో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు క్షేత్రస్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలని సూచిం చారు. ఎక్కడైనా బాల్య వివాహ ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ కోఆర్డినేటర్ గోవిందు శంకరయ్య, కౌన్సిలర్ మున్వర్ సుల్తానా, పొదుపు సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- గూడూరు ఎంపీపీ గురవయ్య

గూడూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. పలు

శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గురవయ్య మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని దాని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్‌ల పాలన ఉందని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్, ఎంపిడిఓ మధుసూదన్ రావు, వైస్ ఎంపీపి మానం ఇంద్రాణి, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీ వాసులకు బిరియాని పంపిణీ

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : టైమ్‌టుహెల్ప్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు నందిపాటి రమేష్ ఆధ్వర్యంలో పాస్టర్ జి.ఇజ్రాయల్ దాతృత్వంలో స్థానిక కాలేరిగుంట గిరిజన కాలనీ వాసులకు శనివారం చికెన్‌బిరియాని ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు ఎస్.కె.బాష

మాట్లాడుతూ పాస్టర్ ఇజ్రాయల్ పేద గిరిజనులకు, మంచి మనస్సుతో చికెన్ బిరియాని అందజేయాలన్న సంకల్పంతో ముందుకు రావడం చాలా సంతోషకరవిషయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో ఆసక్తితో ముందు ఉంటారన్నారు. ఈ కార్యక్రమం టైంటుహెల్ప్ అధ్యక్షులు నందిపాటి రమేష్ ఆధ్వర్యంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. మా స్వచ్ఛంద సేవా ప్రతినిధులు వారి వారి పరిధిలో వివిధ విభాగాల్లో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో రత్నమ్మ పౌండేషన్ అధ్యక్షులు ప్రసాద్‌రావు, ఆపద్బాంధవ సేవా ట్రస్ట్ దామ మధుసూదన్‌రావు, జాగో సేవాసంస్థ జమీర్, పాస్టర్ కుటుంబసభ్యులు, గిరిజన కాలనీ వాసులు పాల్గొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 47మంది ఎంపిక

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కావలి పట్టణం కో-ఆపరేటివ్ కాలనీలోని ఎంఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. ప్రముఖ సంస్థల సుథర్‌ల్యాండ్, ఫస్ట్ సోర్స్, అల్ట్రాయిస్ట్ ఈ క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఈ డ్రైవ్‌కు

సుమారు 90మంది డిగ్రీ, బిటిక్ విద్యార్థులు హాజరయ్యారు. సుథర్‌ల్యాండ్ సంస్థకు 14మంది, ఫస్ట్‌సోర్స్ సంస్థకు 12మంది, అల్ట్రాయిస్ట్ సంస్థకు 21మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ మొత్తం 47మంది విద్యార్థిని, విద్యార్థులు వివిద సంస్థల్లో ఎంపిక కావడం కావలి ప్రాంతవాసులకి గర్వకారణమని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్తుకు మంచి దారులు ఏర్పరచుకున్నందుకు అభినందనలు తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌ను విజయవంతం చేసిన సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కావలి ప్రాంత విద్యార్థులు ఇలాంటి అవకాశాలను వినియోగించుకొని తమ కేరీర్‌ను అభివృద్ధి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రకాష్ రాజు పై కేసు నమోదు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

– చిన్న బజార్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావుకు బిజెపి నేత మిడతల రమేష్ ఫిర్యాదు

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : శ్రీరామ లక్ష్మణులు పండ్ల దొంగలు వలస కూలీలని రామాయణాన్ని అపహాస్యం చేసిన ప్రకాష్ రాజు పై కేసు నమోదు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, చిన్న బజార్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావుకు బిజెపి నేత మిడతల రమేష్ ఫిర్యాదు చేశారు. ప్రకాష్ రాజ్ తన నటనను సినిమాల వరకే పరిమితం చేసుకోవాలని, నిజ జీవితంలో ఇష్టం వచ్చినట్లు నటించడం మంచిది కాదని బిజెపి నేత మిడతల రమేష్ పేర్కొన్నారు. హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముని ఉత్తర భారతదేశం నుండి వచ్చిన వలస కూలీగా ప్రకాష్ రాజు పేర్కొన్నారు. నిన్నటి రోజున కేరళలో ఒక సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న ప్రకాష్ రాజ్ హిందువుల మనోభావాలు దెబ్బ తీశారు. దక్షిణ భారతంకు గిరిజన రాజు రావణాసురుడని రామాయణాన్ని వక్రీకరించాడని, రావణాసురుని పొలంలో పండ్లు దొంగిలించినట్లుగా, శ్రీరామ లక్ష్మణులను పండ్ల దొంగలుగా కొత్త భాష్యం చెప్పాడు. హిందూ దేవుళ్లను హిందూ మత గ్రంథం రామాయణాన్ని ఇష్టమొచ్చినట్టు అవమానించాడు. శ్రీరామ భక్తుల మనోభావాలను దెబ్బతీసిన ప్రకాష్ రాజు పై కేసు నమోదు చేయాలని రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం డిఆర్ఓ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, బైరి శ్రీనివాసులు, రఘురామయ్య, ఏవి సుబ్బయ్య, చిట్టిబాబు, టి శ్రీనివాసులు, పద్మావతి, నాగఫణి తదితరులు పాల్గొన్నారు.

నేడు సంరక్షిస్తే భావితరాలకు సురక్షితమైన నీరు

– జిల్లా ఎస్పి అజిత వేజెండ్ల - పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం జలం జీవం అనే అంశంపై జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల పోలీసు కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయించి, ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జలం లేక జీవం లేదని, ప్రతి నీటి బొట్టు విలువైనదని, మనం ఇప్పుడే సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు సురక్షితమైన నీటి వనరులను అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 150 మంది డికెడబ్ల్యూ కాలేజీ విద్యార్థినిల ఉద్దేశించి మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించి జల స్వచ్ఛతను కాపాడవచ్చని సూచించారు. నీటి వనరులను కాపాడటం ప్రతి పౌరుని బాధ్యతగా భావిస్తూ, ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నీటి వినియోగాన్ని తగ్గించడం, వృథా నివారణ, చెరువులు, కుంటలు, సరస్సుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాడిన నీటిని సరైన విధంగా శుద్ధి చేసి పార్కులు, ఫ్లషింగ్ వంటి అవసరాలకు ఉపయోగించాలని, సోక్ పిట్స్, సమర్థవంతమైన డ్రైనేజ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి, పునరుద్ధరించి సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. శుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. నీటి ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. అలాగే జిల్లా యస్.పి. ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్స్, పోలీస్ కార్యాలయాల్లో జలంజీవం, సేవ్ వాటర్ సేవ్ లైఫ్ కాన్సెప్ట్ గురించి తెలిపి, స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఎస్బి 2 సీఐ శ్రీనివాస రెడ్డి, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఆర్ఐ హరిబాబు, ఆర్ ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

– 212 మంది సిబ్బందికి కోరుకున్న చోటే పోస్టింగ్‌లు

నెల్లూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఎస్పీ డాక్టర్ అజితా వెజెండ్ల నేతృత్వంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బంది బదిలీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగింది. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌లో మొత్తం 212 మంది సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్ల సేవా కాలం పూర్తి చేసుకున్న వారితో పాటు, ఖీఎస్పీ సంపర్కి ద్వారా అభ్యర్థనలు చేసుకున్న కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు ఉన్న సిబ్బందికి ఈ ప్రక్రియలో ప్రాధాన్యత కల్పించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సిహెచ్ సౌజన్య ఈ ప్రక్రియను సమర్థవంతంగా సమన్వయం చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న ఖాళీల వివరాలను ముందుగానే సేకరించి, సిబ్బంది వ్యక్తిగత అవసరాలు, అర్హతలను పరిగణనలోకి తీసుకుంటూ ఎటువంటి వివాదాలకు తావులేకుండా ఈ నియామకాలు చేపట్టారు. నిబంధనల ప్రకారం, పారదర్శక విధానంలో బదిలీలు నిర్వహించడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. తమ అభ్యర్థనలను మన్నించి కోరుకున్న చోట విధులు నిర్వహించే అవకాశం కల్పించినందుకు జిల్లా ఎస్పీకి, అడిషనల్ ఎస్పీకి సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ఏఎస్పీ దీక్ష, ఎస్బీ డీఎస్పీ వి. ధీరజ్ వినిల్, ఏఓ చంద్రమౌళి, సూపరింటెండెంట్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్

తోటపల్లి గూడూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : తోటపల్లి గూడూరు మండలం వరిగొండ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో సిబ్బంది సమిష్టిగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచి, చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రాధిక మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రజల్లో మంచి చైతన్యం కలిగిస్తోందన్నారు. కేవలం ఆసుపత్రుల పరిధిలోనే కాకుండా ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులను నివారించాలంటే పరిశుభ్రత ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశోక్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్‌పీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

దగదర్తి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 5వ రోజు దగదర్తి మండలం దామవరం గ్రామంలో గల బీఎంఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రాసెసింగ్ యూనిట్ నందు ఫ్యాక్టరీలో జరుగు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో మాక్ డ్రిల్ చేసి చూపారు. కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101, 112, 08626-243101, 9963734286 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమం నందు అగ్నిమాపక శాఖ అడిషనల్ డైరక్టర్ ఆర్.జ్ఞాన సుందరం, జిల్లా అగ్ని మాపక అధికారి వి.శ్రీనివాసరెడ్డి, కావలి అగ్నిమాప కేంద్ర అధికారి పి.శ్రీనాథరెడ్డి, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకుల వద్ద అగ్నిమాపక సిబ్బంది అవగాహన

కోట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా కోట మండలం విద్యానగర్‌లో శనివారం పలు పెట్రోల్ బంకుల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వాహనాలకు పెట్రోల్ నింపే సమయంలో సెల్‌ఫోన్లు వినియోగించరాదని, పొగత్రాగరాదని సూచించారు. అనుకోకుండా మంటలు ఏర్పడితే ఆ మంటలను ఎలా అదుపు చేయాలనే అంశాలపై అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

కోవూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మెరుగైన విద్యాబోధన ఉంటుందని , దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం పంచాయతీ గుంటకట్టలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం మనబడి-జ్ఞానబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో బోధన ఉంటుందన్నారు. విద్యార్థులకు విద్యాపరంగా కావాల్సిన మొత్తం ఉచితంగా ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. నాణ్యమైన బోధన, బలవర్ధకమైన పౌష్టికాహారం విశాలమైన క్రీడా ప్రాంగణాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము - కృష్ణపట్నం

ముత్తుకూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా.

ఆర్.ఓ.సి.నెం.01/2026 తేది: 17.04.2026

టెండర్ ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం గ్రామ పంచాయితీకి 2026-2027 సంవత్సరమునకు ఈ క్రింది షెడ్యూలులో తెలిపిన ప్రకారం కృష్ణపట్నం గ్రామ పంచాయితీ కార్యాలయం నందు పంచాయతీ అభివృద్ధి అధికారిగారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డ్ టెండర్లు తేది. 24.04.2026న బుధవారం ఉదయం గం॥ 10.00 నుండి మధ్యాహ్నం గం॥ 1.00 వరకు స్వీకరించబడును. మరియు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు హాజరైన టెండరుదారుల సమక్షంలో సీల్డ్ టెండర్‌లు తెరవబడును. టెండరు దాఖలు చేయువారు క్రింది తెలిపిన విధంగా ధరావత్తు చెల్లించి పాల్గొనవలెను. ధరావత్తు చెల్లించని టెండరు అంగీకరించబడవు.

షెడ్యూలు

వ.నెం.	టెండర్ వివరములు	ధరావత్తు
1	2026-27 ఆర్థిక సంవత్సరమునకు ప్రజారోగ్య పారిశుధ్య సామాను దఫాలు వారీగా సరఫరా	రూ.500
2	2026-27 ఆర్థిక సంవత్సరమునకు వీధి దీపాల విడి భాగాలు సరఫరా చేయుట	రూ.500
3	2026-27 ఆర్థిక సంవత్సరానికి వీధులు శుభ్రం చేయుటకు స్వీపర్లు-4 నలుగురు, CPWS స్కీమ్-త్రాగునీరు సరఫరా, RO ప్లాంట్ నిర్వహణకు-4 నలుగురు, పంపు ఆపరేటర్లు-(5) ఐదు, పారిశుధ్య వాహనం నిర్వహణకు డ్రైవర్-2 ఇద్దరు, మొత్తం 15 మందిని కాంట్రాక్ట్ పద్ధతిన సరఫరా చేయుట (GOMS No:551)	రూ.5000

సం/- రావుల వెంకటేశ్వర్లు పంచాయతీ అభివృద్ధి అధికారి, కృష్ణపట్నం

నెల్లూరు అపోలో హాస్పిటల్ రూ.1,999కే లివర్ స్క్రీనింగ్ పరీక్షలు

నెల్లూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త : ఫ్యాటీ లివర్(కాలేయంలో కొవ్వు చేరడం) అనేది ప్రాథమిక దశలో అంత ప్రమాదకరం అనిపించకపోయినా నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ హిమబిందు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల 19వ తేదీన ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అపోలో హాస్పిటల్‌లో డాక్టర్ హిమబిందు, డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రారంభ దశలోనే ఫ్యాటీ లివర్‌ను గుర్తిస్తే దానికి సంబంధించిన వ్యాధులను నివారించడం చాలా సులువు అని చెప్పారు. ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతోనే అది సాధ్యమన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా అపోలో సంస్థ ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టిందన్నారు. రూ.4,400ల విలువైన లివర్ స్క్రీనింగ్ పరీక్షలను కేవలం రూ.1,999లకే చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీసీ), లివర్ ఫంక్షన్ టెస్ట్(ఎల్ఎఫ్‌టీ), కొలెస్ట్రాల్ పరీక్ష, లివర్ స్కాన్ పరీక్షలు నిర్వహించి నిపుణులైన వైద్యుల సూచనలు, సలహాలు ఉంటాయన్నారు. ఈ స్క్రీనింగ్ ప్యాకేజీ మే నెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని డాక్టర్ హిమబిందు, డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అపాయింట్‌మెంట్ కొరకు 0861-6667333/ 2358333 ఈ నంబర్లను కూడా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో భాగంగా ఫ్యాటీ లివర్ వల్ల కలిగే నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ హిమబిందు, డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి తెలియజేశారు. కొవ్వు పెరగడం వల్ల కాలేయం వాపుకు గురవుతుందని, దీర్ఘకాలం పాటు కొవ్వు పేరుకుపోవడం కారణంగా కాలేయం గట్టిపడి, శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతే కాకుండా దీని వల్ల టైపు-2 డయాబెటిస్, రక్తపోటు(బీపీ), గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరుగుతుందని, చివరకు కాలేయం పూర్తిగా పని చేయలేని పరిస్థితి వచ్చే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నూనెలో వేయించిన పదార్థాలు, జంక్ ఫుడ్ మిఠాయిలను తినడం తగ్గించుకోవాలని, పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఆకు కూరలు, పండ్లు, తృణ ధాన్యాలను ఆహారంలో భాగంగా చేర్చుకుని తినాలని సూచించారు. శరీర బరువును అదుపులో ఉంచుకుంటే కాలేయంపై ఉన్న కొవ్వు క్రమంగా తగ్గుతుందని, వ్యాయామం తప్పనిసరిగా చేయాలని, మద్యపానానికి దూరంగా ఉండాలని వెల్లడించారు. క్రమం తప్పకుండా లివర్ ఫంక్షన్ పరీక్ష తప్పనిసరి అని సూచించారు. ఈ మీడియా సమావేశంలో హాస్పిటల్ డైరక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

– సర్వసభ్య సమావేశంలో అధికారులు

కోట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : వేసవి నేపథ్యంలో మండలంలో ఎక్కడా కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులపై ఉందని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఇన్‌ఛార్జ్ మండల అధ్యక్షురాలు వేమారెడ్డి సౌజన్యరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోందని చెప్పారు. గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు, గ్రామపెద్దలు సమన్వయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. వేసవి కాలంలో అధికారులు తరచూ నీటి వనరులను పర్యవేక్షిస్తుండాలని కోరారు. ప్రస్తుతం మండలంలో జనగణన కార్యక్రమం జరుగుతుందని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.జయజయరావు, జడ్పిటిసి కోటయ్య, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక యూరియా వాడొద్దు.. సేంద్రియ ఎరువులే మేలు : డీఏఓ

వింజమూరు, ఏప్రిల్18, ప్రభాతవార్త : రైతులు విచక్షణారహితంగా పంటలకు యూరియా వాడటం వల్ల భూసారం దెబ్బతింటు౦దని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. శని వారం స్థానిక వ్యవసా యశాఖ సబ్ డివిజన్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె వ్యవసాయ అధికారులను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను ఉద్దేవించి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి వర్మీ కంపోస్టు పచ్చిరొట్ట ఎరువులను వాడేలాఏవోలు గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఖరీఫ్ అవసరాలను ముందుగా గుర్తించి రైతు లకు అండగా ఉండాలని సూచించారు. రానున్న ఖరీఫ్‌సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన ఎరువులు సాగు వివరాలను విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు వెంటనే సమాచారాన్ని సేకరించాలన్నారు. ఈ నెలాఖరులోగా గ్రామంలో రైతులకు రసాయనిక ఎరువుల అధిక వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అధిక యూరియా వాడడం వల్ల భూమి నిస్సారం అవ్వడమే కాకుండా పంటలకు చీడపీడల తాకిడి పెరుగుతుందన్నారు. దాంతో రైతుకు పెట్టుబడి భారం పెరుగుతుందన్నారు. కనుక రసాయనిక ఎరువులకు బదులుగా గ్రామాల్లోని చెత్త నుండి సంపద కేంద్రాలలో సిద్దంగా ఉన్న వర్మీ కంపోస్టు ను రైతులు పంటలకు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఆమె సూచించారు. వేసవిలో భూసారాన్ని పెంచేందుకు జీలుగు, జనుము, పిల్లి పెసర వంటి పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేయాలన్నారు. ప్రతి రైతుకు భూసార పరీక్ష కార్డులు అందజేయాలని ఆ నివేదిక ఆధారంగానే ఎరువులు మోతాదును నిర్ణయించుకునేలా రైతుల్లో చైతన్యం తేవాలని స్పష్టం చేశారు. మండల వ్యవసాయ అధికారులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను పర్యవేక్షిస్తూ వారి ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు అందించే విధంగా చూడాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని విధులు పట్ల నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జేడీఏ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శేషగిరిరావు, ఏవో శ్రీనివాస్‌రెడ్డి, వింజమూరు ఏవో వాసు జలదంకి ఏవో శ్రీవాణి, కలిగిరి ఏవో జహీర్, కొండాపురం ఏవో హరినారాయణ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల మధ్య మున్సిపల్ కమిషనర్ పుట్టినరోజు వేడుకలు

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ తన పుట్టినరోజు వేడుకలను తన సతీమణి సుబద్ర, కుమార్తె శ్యాతిలతో కలసి స్థానిక తుఫాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న పేద విద్యార్థుల మధ్య కేక్‌కట్ చేసి సంతోషంగా జరుపుకోవడం జరిగింది. పిల్లలందరికి స్టేషనరీ కిట్స్ అందజేసి చికెన్ బిర్యాని భోజనం పెట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తన పుట్టినరోజును సంయుక్త సేవా సంస్థ కార్యాల యంలోని పేద విద్యార్థుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉదన్నారు. పిల్లలు ఎంతో శ్రద్దగా చదువుకొని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని సూచించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఎటువంటి ఆడంబరాలకుపోకుండా తన పుట్టినరోజున పేద విద్యార్థుల ఆలకి తీర్చడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలోనే బలవర్ధకమైన పౌష్టికాహారం

కోవూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల్లోనే లభిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమ బిడ్డలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా అన్నారు. కోవూరు పంచాయతీ పరిధిలోని శివాజీ నగర్‌లో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులకు, బాలింతలకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయట అంగళ్లలో దొరికే జంక్ ఫుడ్ వలన పిల్లల్లో అనారోగ్యం ఎక్కువగా సోకే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతాన్ని పిల్లలకు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది పలు ఆరోగ్యకరమైన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నీటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలి

కోవూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని దానిని భూమిలోకి పంపేలా ప్రతి ఇంటి యజమాని చొరవ తీసుకుంటే భూగర్భ జలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరు తాలూకా కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణ గ్రామం ప్రాంగణంలో రెయిన్ హార్వెస్టింగ్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృథాగా పోతున్న వర్షపు నీటిని ఒక క్రమ పద్ధతిలో భూగర్భ జలాల పెంపుదలకు ఉపయోగపడేలా ప్రతి ఇంటి యజమాని తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ వృథా నీటి వలన భూగర్భ జలాలు గణనీయంగా పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాసులు, సురేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా జనగణన చేపట్టాలి

గంగవరం,(కోవూరు) ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో మే 1వ తేది నుంచి ప్రారంభం కానున్న జనగణనకు సంబంధించి మూడవ బ్యాచ్‌కు శనివారం కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం మే 1వ తేది నుంచి ఎన్యుమరేటర్ల ద్వారా ఈ జనగణన కార్యక్రమాన్ని చేపట్టాలని, దీనికి సంబంధించి సూపర్‌వైజర్లకు, ఎన్యుమరేటర్లకు మూడు విడతలగా శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఎన్యుమరేటర్ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పూర్తిగా అవగాహన చేసుకుని వారికి కేటాయించిన ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 33 ప్రశ్నలతో కూడిన వివరాలను సేకరించి ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో రామ్మోహన్, ఎంపీడీవో శ్రీహరిరెడ్డిలు పలు సూచనలు చేశారు. దీనికి సంబంధించి మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసులు, ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు.

ఎల్‌పీజీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

కోవూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ ప్రాంతాల్లో ఎల్‌పీజీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం. రాజా అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల విషయంలో ముఖ్యంగా గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి ప్రమాదం సంబవించినప్పుడు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా జాతీయ రహదారిలో ఉన్న చౌదరి పెట్రోల్ బంక్‌లో కూడా ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్‌లు డేవిడ్‌సన్ , నారాయణ, ఫైర్‌మెన్ కమలాకర్, రవి, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

వైభవంగా పల్లకి సేవ



కోవూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతా చార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహిం చారు. మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, మాజీ దేవాలయ చైర్మన్ పోలుదాసు వెంకటేశ్వర్లు దంపతులు, భక్తులు ఉన్నారు.

పెనుబల్లి అంగన్‌వాడీలో పోషణ పక్వాడ

బుచ్చి ఏప్రిల్ 18 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.నిర్మల గర్భవతులకు పలుసూచనలు ఇచ్చారు. కుటుంబ పోషణలో పురుషులు భాగస్వామ్యం ఉండాలని కోండం జరిగిందని ఆమె తెలిపారు. ఇంట్లో తయారు చేసిన స్నాక్స్ మాత్రమే పిల్లలకి ఇవ్వాలని చెప్పారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్ సుజాత, కె శేషమ్మ, ప్రభావతి అమరసేన పాల్గొన్నారు.

వార్త CLASSIFIEDS

CHANGE OF NAME

I, GIDDANGI MANOJ VENKATA SAI KUMAR S/O Giddangi Suresh Babu R/O Flat 402 kaveri block chintareddypalem road Medicover Hospitals Balijapalem Nellore, have changed my name to GIDDANGI M V SAI KUMAR vide affidavit dated 07/03/2026 at Nellore (Ro.No.2546)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

పాలీసెట్ 2026 హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : రాష్ట్ర సాంకేతిక విద్యామండలి వారి సూచనల మేరకు పాలీసెట్ 2026పరీక్షలకు సంబందించి హాల్ టికెట్లను ఈనెల 18నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని రుద్రకోట కావలి గవర్నమెంటు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్ కుమార్ ప్రియ శనివారం తెలిపారు.

ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ అభ్యర్థులు ఈనెల 25న ఉదయం 9గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతించబుతుందని తెలి పారు. ఉదయం 11గంటలనుంచి మద్యా హ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయ న్నారు. పట్టణంలో ఈ పరీక్షలు రెండు కేంద్రాల్లో రుద్రకోట గవర్నమెంటు పాలి టెక్నిక్ కళాశాల, ఉదయగిరిరోడ్డులోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిం చడం జరుతుందని తెలిపారు. విద్యార్ధులు హాల్‌టికెట్లను డౌన్‌లోడుచేసుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టికెట్, పెన్సిల్, ఎరైజర్, షార్నర్, ఒక ఐండిం టికార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని, పాలీసెట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లును పకడ్బందీగా చేసినట్లు తెలిపారు.



జెడ్పీలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

- జెడ్పీపరిసరాలు శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్ అరుణమ్మ

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ కార్యా లయప్రాంగణంలోని శనివారం నిర్వ హించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత చైర్ పర్సన్ అరుణమ్మతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఈఓ మోహన్ రావు త, వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీ కార్యాల య సిబ్బంది. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమలో భాగంగా పరిసరాలను శుబ్రం చేసి క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు.

జిల్లా జర్నలిస్టులకు 24న మెగా హెల్త్ క్యాంపు

- జిల్లాలోని పాత్రికేయులు సద్వినియోగం చేసుకోండి
- ఈ నెల 21 ఉదయం 10 గంటల లోపు 91 9581648888 వాట్స్ అప్ నెంబర్ నందు తమ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 24, 25 తేదీలలో రెండు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) నందు మెగా హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో జిల్లాలోని జర్నలిస్టులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్య పరీక్షలకు హాజరగువారు +91 95816 48888 వాట్స్ అప్ నెంబర్ నందు తమ వివరాలతో ఈ నెల 21 (మంగళవారం) ఉదయం 10 గంటల లోపు.. రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. లేదా నేరుగా జీజీహెచ్‌లో కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది. షుగర్, రక్త పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షల కోసం, ఖాళీ కడుపుతో రావాలని, అలాగే గతంలో చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్ట్ ఏవైనా ఉంటే వాటిని తీసుకురావాలని సూచించారు. సాంపిల్స్‌కు సంబంధించిన ఫలితాలు వచ్చిన అనంతరం సంబంధిత వైద్యుల ద్వారా కన్సల్టేషన్ నిర్వహించబడుతుంది. నమోదు వివరాలు: జర్నలిస్టు పేరు, పనిచేయుచున్న మీడియా సంస్థ పేరు. డేట్ ఆఫ్ బర్త్, వయస్సు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు హెల్త్ కార్డు/ ఆరోగ్య శ్రీ కార్డు, మొబైల్ నంబర్, అక్రిడిటేషన్ కార్డు నంబర్, జర్నలిస్టు వైఫ్ / పిల్లలు/ వారి తల్లిదండ్రుల పేర్లు, వారి ఆధార్ కార్డ్స్, ఫ్యామిలీ సర్టిఫికెట్ తదితర వివరాలను నమోదు చేయాలి, ఉచిత మె గా హెల్త్ క్యాంప్ నందు సిబిపి కంప్లీట్ బ్లడ్ పిక్చర్, ఆర్ఎఫ్‌టి కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, ఎల్ఎఫ్‌టి లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, ఎక్స్‌రే, ఈసిజి, కంప్లీట్ యూరిన్ ఎగ్జామినేషన్, ఐ చెకప్, ఆంత్రోపోమెట్రిక్ మెజర్ మెంట్స్, 10. మాస్టర్ హెల్త్ చెకప్ విత్ ఫిజీషియన్, జిల్లాలోని జర్నలిస్టులు ఈ మెగా హెల్త్‌క్యాంపు అవకా శాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో కోరారు

ఎమ్మెల్యేకి టిడిపి నాయకుల అభినందనలు

కోట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరు ఎ మ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ నియమి తులైన సందర్భంగా కోట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎం.సర్వో త్త మరెడ్డి, కోక్లస్టర్ ఇన్‌ఛార్జ్ తీగలసురేష్‌బాబులు కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజే శా రు. మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పనితీరు, అంకితభావం, నిబద్ధతను గు ర్తించిన పార్టీ అధిష్టానం పార్టీ ప్రధాన కార్యద˜ర్శి పదవిని అప్పగించడం హర్షణీయమన్నారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లో కేష్‌బాబుకు, టిడిపిరాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాస్‌కు, సహకరించిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌బికెఆర్‌లో సందడే సందడే పండగలా ఎస్టాటికా వేడుకులు

కోట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త కోట మండలం విద్యానగర్‌లోని ఎన్ బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎస్టాటికా సంబరాలు అం బరాన్నంటాయి. ఈ ఎస్టాటికా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీని వాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మా ట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విజయానికి మూడు కీలక సూత్రాలని పేర్కొన్నారు.విద్యార్దులు అవిలువలను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఏరంగం లోనైనా అగ్రగామిగా నిలుస్తారని అన్నారు. తమ కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి కళలను ఏంతోగానో ప్రోత్స హిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఈ లాంటి వేడకలను కళాశాలలను నిర్వహించు కొవడం జరుగుతుందన్నారు. విద్యార్దులు నృతాలు, సంగీత ప్రదర్శనలు వంటి పలు సినీ గేయాలు అంద రిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్,ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్దుల్లో సృజనాత్మక, నాయకత్వ లక్షణాలుఏంతో అవసరమన్నారు. ఆరోగ్యం,విద్య రెండు సమానమని నేర్కొన్నారు. శారీరక,, మానసిక దృడత్వం ఉన్నపుడే విద్యార్దులు ఉన్నత శిఖరాలను అధిరోహించగరని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్దులు విజయాలు సాధించాలంటే నైతిక విలువలు క్రమశిక్షణ ఏంతో అవసర మన్నారు.విద్యార్దులకు కళలు కూడా అవసరమన్నారు. కళళలకు ఈ లాంటి ఎస్టాటికా కార్యక్రమాలు ఒక వేదికగా నిలుస్తాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను ప్రదర్శించారు.. పలువురు విద్యార్థులు నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.సాంస్కృతి కార్యక్రమాలు కళాశాలలో పండగ వాతావారణం అలుముకుంది. ప్రధానంగా ఎన్‌సిసి విద్యార్దులు ప్రదర్శించిన పౌరాణిక నాటకం అందరిని మెప్పించింది. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బహుమతులు పంపిణీ:** గేట్ ర్యాంక్ సాధించిన విద్యార్దులకు బహుమతులను డైరెక్టర్, విజయకు మూర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎం.శ్రీనివాసులు పంపిణీ చేశారు. అదే విధంగా పలు క్రీడా రంగాల్లో విజేతలకు కూడా బహుమతులను అందచేశారు. విజయవతంగా నిర్వహించిన అధ్యాపకులైన వల్లి బాషా ను ప్రత్యేకంగా అభినిందించారు

ఏసీ స్టేడియంలో స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



నెల్లూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త–విద్య జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాం గణంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా జలధార,జల హారతి థీమ్‌ని చేపట్టారు. డిఎస్ఏ సిబ్బంది,కోచ్‌లు, క్రీడామైదానంలోని చెత్తా చెదారాలను, పిచ్చి మెక్కలను శుభ్రంచేశారు.ఈ సందర్భంగా జిల్లా క్రీడాధికారి ఎస్‌కే.జసీం మాట్లాడుతు వేసవి తీవ్రతను దృ ష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని, భూగర్బజలాల పునరుద్దరణకు అందరూ పాటుపడాలని కోరారు. క్రీడాకారులు క్రమశిక్షణతోపాటూ పర్యావరణ పరిరక్షణపై అవగాహ కలిగి ఉండాలన్నారు. జల వనరులను ఆరోగ్య కరంగా ఉంచుకోవటంతోనే బలమైన సమాజం సాధ్యమౌతుందని తెలిపారు. వారు ప్రతిజ్ఞను చేపట్టారు.ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మురళీ, వెంకట్, కోచ్‌లు రజినీ, తులసీ, ఇతర క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు జనాభా గణన శిక్షణా తరగతులు

కమిషనర్ వైఓ.నందన్

నెల్లూరు కార్పోరేషన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వై.నందన్ స్థానిక వైఎంసి ప్రాంగణంలోని వీఆర్‌పిజి కాలేజీలో చివ రి రోజు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుకు(వార్డు సచివాలయ కార్యదర్శులు) జరుగనున్న జనాభా గణన శిక్షణ తరగతులు నిర్వహణ తీరును సెన్సెస్ ప్రత్యేక అధికారి రాజేంద్రప్రసాద్‌లతో కలసి శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ స్వీయ నమోదు జనాభా గణన శిక్షణలో కార్యక్రమంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్వీయ నమోదు కార్యక్రమం ద్వారా ఇంటింటి జనాభా సేకరణకు అవసరమైన పరిజ్ఞానంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవచ్చునని కమిషనర్ సిబ్బందికి సూచించారు. జనాభా గణన ప్రశ్నావళి వివరాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని మే నెల 1నుంచి జరగనున్న ఇంటింటి జనాభా సేకరణ, ఇండ్ల జాబితా సర్వేను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. జనాభా గణన స్వీయ నమోదుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎస్‌ఈ,సెన్సెస్.జిఓవి.ఇన్ వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రశ్నావళికి పూర్తి చేసి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో పూర్తిస్థాయి జనాభా గణన అంశంపై అవగాహన పెంచుకొని సర్వేలో ఉన్నత ప్రతిభ కనబరచాలని, ప్రజల నుంచి సంపూర్ణ సహకారంతో వారి పూర్తి వివరాలను సేకరించాలని కమిషనర్ సూచించారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర

నెల్లూరు కార్పోరేషన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 3వ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.నందన్ స్థానిక బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల జలధార–జలహారతి అన్న అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కమిషనర్ స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను అందరితో చేయించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీళ్ళను పొదుపుగా వాడుకోవాలని, నీటి వృదాను అరికట్టి భూగర్భ జలాలను కాపడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. సురక్షిత తాగునీటివాడకంపై ప్రజలందరికి అవగాహన కల్పించి పర్యావరణ పరిక్షణకు అందరూ కృషి చేయాలని కమిషనర్ సూచించారు. అనంతరం దర్గా ప్రాంగణంలోని ఘాట్, స్వర్ణాల చెరువు పరిసర ప్రాంతాలలోని పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్కను తొలగించి శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిదర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, నెల్లూరు నగరపాలకసంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దినేష్, ఇంజనీరింగ్ విభాగం ఎస్‌ఈ. రహంతుజానీ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు జీజీహెచ్‌లో ఘనంగా 8వ పోషణ్ పక్వాడా కార్యక్రమం

నెల్లూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త–వైద్యం పసి పిల్లలకు మొదటి ఆరేళ్ల మొదడు అభివృద్ధిని పెంచడం కోసం తల్లులు ప్రాధాన్యత నివ్వాలని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కే.మాధవి పిలుపునిచ్చారు. 8వ పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం నెల్లూరులోని జీజీహెచ్‌లో గర్బిణీలు, బాలింతలకు పోషకాహారం, 1000 రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కే.మాధవి మాట్లాడుతూ జీవితంలో మొదటి ఆరేళ్ల మెదడు అభివృద్ధిని పెంచడం కోసం మహిళలు ప్రాధాన్యతనిచ్చి తాను పోషకాహారం తీసుకుంటూ పిల్లలకుకూడా పోషకాహారాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని గర్భిణీలు బాలిం తలు, వారి కుటుంబ సభ్యులకు చిన్నారుల ఎదుగుదల మెదడు వికాసంలో తల్లిదండ్రుల పాత్ర పై ప్రత్యేక అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తూ సూపర్ డాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి చిరుధాన్యాలతో చేసిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారుఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.స్వరూప, ఏ.ప్రమీలమ్మ, పి.విజయలక్ష్మీ, కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు చేపట్టాలి

-పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసిన జనసేన నేతలు



నెల్లూరు ఏప్రిల్ 18, ప్రభాతవార్త–విద్య జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణం చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన శ్రీనివాస్ యాదవ్, స్టాండప్ కమెడియన్స్ రఫిక్, అనుదీప్ కటికలపై తక్షణం కేసు నమోదు చేయ్యాలని కోరుతూ శనివారం నగరంలోని స్థానిక 1వ నగర పోలీసుస్టేషన్ సిఐ కు ఫిర్యాధు చేశారు. తక్షణం ఎఫ్ఐఆర్ నమోదుచేసి నిందితులను అరెస్టుచేయ్యాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా దుగ్గిశెట్టి మాట్లాడుతు ఈనెల 14న మంగళగిరిలో జరిగిన బిసీవై పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద జరిగిన దీక్షా క్యాక్రమంలో శ్రీనివాస్ తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ మాటల వలన తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, పార్టీల మద్య, కులాల మద్య చిచ్చు పెట్టే విదంగా వ్యవహరించిన అనతిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బిసీలకు 2009 ఎన్నికల్లో అనేక సీట్లు కేటాయించి తగిన న్యాయం చేశారని గుర్తుచేశారు. అలాగే స్టాండప్ కామెడీ పేరుతో రఫీక్, అనుదీప్‌లు పవన్‌కళ్యాణ్‌పై ఆయన కుటుంబంపై కుడా నీచంగా మాట్లాడారన్నారు. వీరిపై తక్షణం చర్యలుతీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరరామిరెడ్డి, షేక్.అలియా, శనివారపు అజయ్‌కుమార్, ఆముదాల సుమంత్, చిత్తూరు రాము, హైమావతి, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

హైకోర్ట్ న్యాయమూర్తిని కలిసిన జ్యూడిషరీ ఉద్యోగ సంఘ నేతలు

నెల్లూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్ సంద ర్భంగా హైకోర్టు న్యాయమూర్తి, నెల్లూరు పోర్ట్ పోలియో జడ్జిగఅయిన జస్టిస్ కే.సురేష్ రెడ్డిహాజరయ్యారు. ఈసందర్భంగా జ్యూడిషరీ ఎంప్లాయిస్ ఏపీ స్టేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రెసిడెంట్ పివి నారాయణరెడ్డి, జిల్లా సెక్రె టరీ వెంకట సునీల్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. జిల్లాలో ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయమని ఆయ న కోరగా ప్రస్తుత జిల్లా జడ్జి జి. శ్రీనివాస్ తమ సమస్యలకు చాలా వరకు పరిష్కార మార్గం చూపించినట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్దం కావలి

కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్దం కావాలని ఏఐటియూసి రాష్ట్ర సమితి సభ్యులు దామ అంకయ్య,ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి యామలా మదులు పిలుపునిచ్చారు. ఏఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్లను స్థానిక సిపిఐ కార్యాలయం నం దు శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా దామా అంకయ్య, యామాల మధులు మాట్లాడుతూ ఈనెల 26, 27, 28వ తేదీల్లో తిరుపతిలో ఏఐటియుసి రాష్ట్ర 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరా రు. 26న కార్మిక ప్రదర్శనకు ఏఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్‌కౌర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటియుసి సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. 26వ తేది జరిగే కార్మిక ప్రదర్శనకు నెల్లూరుజిల్లా నుంచి వేలాదిగా కార్మికులు రావలని పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉండే నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం ద్వారా కార్పోరేట్ కంపెనీలకు మేలు జరుగుతుందన్నారు. ఏఐటియుసి కార్మికుల పక్షాన నిలబడి ప్రస్తుతం కార్మికులకు ఉన్న చట్టాలను కాపాడుకుంటూ కార్మికుల రక్షణకు కొత్త చటాటల అమలకు పోరాటాలు సాగిస్తుందన్నారు. తిరుపతిలో జరిగే ఏఐటియుసి రాష్ట్ర మహాసభలు కార్మిక వ్యతిరేక విధానాలపై పోటా లకు వేధిక కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పర్తి నాగరాజు, వై.రవి. నరసింహులు, పాముల శ్రీనివాసులు, ఏఐటియుసి నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఇన్ఫాంట్ జీసస్ పాఠశాలల్లో ఘనంగా స్నాతకోత్సవం వేడుకలు

వింజమూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త వింజమూరులోని స్థానిక ఇన్ఫాంట్ జీసెస్ పాఠశాలలో స్నాతకోత్సవం వేడుకలను కనుల పండుగ జరిగాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కోలాహలం సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విశ్రాంత జిల్లా వైద్య అధికారి కే.మాశిలామణి ఎంఈఓలు పోలుబోయిన రమేష్ యాదవ్ మధుసూదన్‌రెడ్డిలు హాజరయ్యారు. అతిధులకు ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు, సిబ్బంది పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు మాట్లాడుతూ పాఠశాల కరస్పాండెంట్ సంకె ఐజాక్, డైరక్టర్ సంకె డేవిడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవ బోధనసిబ్బంది, బోధనేతర సిబ్బంది అంకితభావంతో విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నారని పాఠశాలలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు క్రమశిక్షణతో కూడిన విద్యావిధానాన్ని అతిధులుఅభినందించారు. గ్రామీణ ప్రాంతంలోని కార్పొరేట్ స్థాయి విద్యను పాఠశాల యాజమాన్యం అమలు పరచడం ఎంతో అభినందించతగిన విషయం అన్నారు. ప్రైవేటు పాఠశాలలు నడపటం ఎంతో శ్రమతో కూడుకున్న పని అయినప్పటికి కరస్పాం డెంట్ ఐజాక్ తన తండ్రి ఆశయాలు మేరకు తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం అలాగే ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత చదువులు కోసం నగరాలకు వెళ్లినప్పుడు అక్కడ వారు అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడడం అద్భుత ఫలితాలు సాధించడం ఈ పాఠశాల నాణ్యతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచడమే కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అనంతరం విద్యాభ్యాసాన్ని విజయ వంతంగా పూర్తి చేసిన విద్యార్థులు ప్రత్యేక కౌన్లు ధరించి అతిధుల చేతుల మీదుగా సర్టిఫికేట్లను మెమోం టోలు అందుకున్నారు. గౌన్లతో ఉన్న విద్యార్థులు ప్రత్యేకంగా కనిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శనలు తల్లిదండ్రులను స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలను కనుల పండుగ జరిగాయి. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల కోలాహలం సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా మారింది.

భూగర్బజలాల పెంపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే



కావలి, ఏప్రిల్ 18 ప్రభాతవార్త : భూగర్బజలాల పెంపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నీటిని కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని నీటిని వృదా చేయకూడదని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛఆంధ్రా స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో మందాడి చెరు వువద్ద నిర్వహించిన నీటి వనరుల పునరుద్దరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెరువు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. చెత్తపేరుకుపోవడం నిర్వహణలో ఉన్న లోపాలపై మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య, సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి ప్రస్తుతం జరుగుతున్న పనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. భగర్బ జలాలు పెంచుకునేలా నీటిని నిల్వ చేసే విధంగా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మందాడి చెరువు శుభ్రత,నిర్వహణ కోసం స్థానిక కార్యాచరణ ప్రణాళికను ప్రకటిస్తూ బాధ్యతలను స్పష్టంగా నిర్దేశించారు.ఈకార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు చురకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిశోర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రావన్‌కుమార్, స్థానిక నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.